## క్లుప్తంగా

### కవి ప్రసాదరావు రచనలు ఆవిష్కరణ



వినుకొండ : గుంటూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రపంచ ప్రఖ్యాత న్యూరోసర్జన్ నాగార్జునకొండ సుందరాచార్యులు శ్రీశైలం వెళ్తూ మార్గమధ్యలోని పట్టణంలో గల ఏబీఎం కాంపౌండ్‌లోని ప్రముఖ కవి, ఎడారి కోయిల తెలగలపూడి ప్రసాదరావు నివాసంలో అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు రచించిన కవితోద్యానపు వసంత కోయల జాషువా, భారతరాజ్యాంగ రచనా భారవి గ్రంథాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిలకల జాన్‌సుందరరావు, ఎర్రగుంట్ల భాస్కర్, తెలగలపూడి బెంజిమెన్, రత్నాకర్, పల్నాటి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి



శావల్యాపురం: వరి నారు మడికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సంఘటన స్థలంలో మృతి చెందిన సంఘటన శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సన్నకారు రైతు తిరివీధి రామ సుబ్బారావు (60) మూడు ఎకరాలు పొలం ఉంది. కొంకెరు వాగు సమీపంలో వరి నారుమడి సాగు చేసేందుకు గాను 25 సెంట్లు సాగు చేశాడు. ఈక్రమంలో విద్యుత్ అంతరాయం వాటిల్లగా దగ్గరలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు వెళుతుండగా విద్యుత్ వైరు తెగిపడి ఉండటాన్ని గమనించిన రైతు రామ సుబ్బారావు విద్యుత్‌వైరును తగలడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై సంఘటన స్థలంలో మృతి చెందినట్లు చుట్టుపక్కల పొలాలకు చెందిన రైతులు చెప్పారు. సంఘటన స్థలానికి వీఆర్వో ఉప్పలూరి చిన మంగయ్య పోలీసులు చేరుకొని ప్రమాదం తీరు అడిగి తెలుసుకున్నారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

### రైతులూ.. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయండి

రొంపిచర్ల: మండలంలోని మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో వ్యవసాయ అధికారి శివలలిత పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో వరి నారుమళ్ల సాగుపై రైతులకు సూచనలు సలహాలు అందజేశారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలన్నారు. మెట్ట నారుమళ్లు, దమ్ము నారుమళ్ల సాగు, యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన షాపు నుంచి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

### బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

నూజెండ్ల: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోనిఅయినోలు,దాట్లవారిపాలెం (రెడ్డిపాలెం) గ్రామాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు గ్రామాల్లో అనధికారకంగా మద్యం సీసాలను అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అయినోలు గ్రామానికి చెందిన రెవళ్ళ కిరణ్ కుమార్, దాట్లవారిపాలెం గ్రామానికి మక్కెళ్ళ ఏడుకొండలు అను వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇద్దరు దగ్గర నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్ట్‌షాపుల నిర్వహిస్తే అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఎస్సై వినీల, ఎక్సైజ్ పోలీసులు ఉన్నారు.

### ప్లేట్లు, గ్లాసులు వితరణ

శావల్యాపురం: స్థానిక భవిత సెంటరు నందు ప్రత్యేక అవసరాల కల్గిన విద్యార్థులకు ఆరంబ్ ఏడ్యుకేషన్ ట్రస్టు వారి సారధ్యంలో భోజనం ప్లేట్లు గ్లాసులు బుధవారం అందజేశారు. బిళ్ళా రాజారమేష్ మాట్లాడుతూ పేదబడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులకు విద్య పరంగా ట్రస్టు సారథ్యంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు సభ్యులు ఘంటా నాగేశ్వరరావు, భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రేషన్‌షాపులపై దాడులు

బొల్లాపల్లి: మండలంలో పలు రేషన్ షాపులపై సివిల్ సప్లెయ్ అధికారులు బుధవారం దాడులు-నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు బృందం పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. వెల్లటూరు, వడ్డంగుంట, గుమ్మనంపాడు గ్రామాలను షాపులను తనిఖీ చేశారు. గత వారం రోజుల్లో రేషన్ షాపులపై దాడులు చేయడం ఇది రెండోసారి అని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సానుభూతిపరులకు చెందిన షాపులపై మాత్రమే అధికారులు ఈ దాడులకు పాల్పడుతున్నారని డీలర్ల నుంచి ఆరోపణనిపిస్తున్నాయి.

# బిడ్డకు తల్లిపాలే మేలు

**వాడవాడలా తల్లిపాల వారోత్సవాలు**



కొనకంచివారిపాలెంలో మాట్లాడుతున్న మరియకుమారి

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మరియకుమారి మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలన్నారు. అలా చేస్తే బిడ్డ చురుకుగా ఉండటంతో పాటు, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలలో బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన అన్ని పోషకాలు ఉంటాయన్నారు. బిడ్డకు పాలు పట్టడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటి వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. అలాగే తల్లులు కూడా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆకు కూరలు, పాలు, గుడ్లు ఆహారంలో ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ డి. పద్మ, పలువురు గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

**గణపవరంలో...**

నాదెండ్ల: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి చెప్పారు. గణపవరం రెండో సచివాలయం పరిధిలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డ ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. బిడ్డలో రోగనిరోధక శక్తి పెరిగి అనారోగ్యాల బారినపడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఆరు నెలలు దాటాక బిడ్డకు ఘనాహారం అందించాలన్నారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.ప్రసాద్ నాయక్, ఎంపీహెచ్‌వో శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

**వినుకొండలో...**

వినుకొండ: పట్టణంలోని కట్టకింద బజారు సచివాలయం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శేషకుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపు తల్లిపాలు ఇవ్వాలని, ఇవి బిడ్డకు ఎంతో ముఖ్యమని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం తప్పనిసరిగా సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు షేక్ రజియా, షేక్ నీలిమ, షేక్ జాన్‌బీ, వై. నీరజ, సిబ్బంది, గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వినుకొండలో ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు



గణపవరంలో మాట్లాడుతున్న పార్వతి

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

**నెల్లూరు హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్**



మొక్కలునాటుతున్న మానవతా సంస్థ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని నెల్లూరు హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్ తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, నెల్లూరి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మనావతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ ప్రారంభించిన తరువాత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. జేఎన్‌టీయూఎన్ ఎన్ఎస్ఎస్‌ప్రోగ్రాం ఆఫీసర్ జీపీ రాజు మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు డాక్టర్ బెల్లం అనూష, ఎస్.రామారావు, మాకినేని హరిబాబు, కోయ రామారావు, చేగు వెంకటేశ్వర్లు, కదం నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం కాదు శాంతే మానవాళికి రక్ష



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ సుబ్బారావు



హాజరైన విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని మాస్టర్ మైండ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 'హిరోషిమా డే' బుధవారం జరిగింది. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. యుద్ధాల వల్ల కలిగే వినాశనాన్ని, శాంతి ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేసేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రెండో ప్రపంచ యుద్ధం ముగింపు దశలో జపాన్‌లోని హిరోషిమాపై అమెరికా అణుబాంబు వేయడం వల్ల జరిగిన పెను విషాదాన్ని వివరించారు. అలాంటి ఘోరం పునరావృతం కాకుండా ఉండాలంటే, ప్రపంచ దేశాలన్నీ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మూడో ప్రపంచ యుద్ధానికి అవకాశాలు కనిపిస్తున్నాయని, అది సంభవిస్తే భూగోళం పూర్తిగా అంతమైపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు చర్చా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. చివరిగా డాక్టర్ పీవీ సుబ్బారావు విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎండీ తమీమ్ అహమ్మద్, ప్రిన్సిపాల్ రఫీ, సోషల్ టీచర్ సామ్రాజ్యం, సొసైటీ సభ్యులు వడ్లాన సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

**డాక్టర్ కిరణ్‌కుమార్**



డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నూతన ఆవిష్కరణలు చేపట్టేలా విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలని గిపు కంపెనీ (జపాన్) సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జి.కిరణ్‌కుమార్ తెలిపారు. పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సమాజాన్ని పరిశీలిస్తూ ఎదురయ్యే సమస్యలపై దృష్టి సారించి ప్రత్యేక శ్రద్ధ, క్రమశిక్షణతో నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ప్రతి నూతన ఆవిష్కరణకు మూలం సామాన్యుడు ఎదుర్కొనే సమస్య అనే అంశాన్ని గుర్తించాలని స్పష్టం చేశారు. సదస్సులో కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ కాకాని సుధాకర్, రాజనీతి శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ దీప, కామర్స్ అధ్యాపకురాలు కల్పన, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

### యాపిల్ లోడ్ మినీలారీ బోల్తా

యడ్లపాడు: వేగంగా వెళ్తున్న యాపిల్‌లోడ్ మినీలారీ పల్టీ కొట్టింది. మండలంలోని తిమ్మాపురం బైపాస్ రహదారిపై వెళ్తున్న టాటా అప్పీ ఆటో మలుపు వద్ద బుధవారం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం కొంత ధ్వంసం కావడంతో పాటు యాపిల్ బాక్సుకు కొన్ని రోడ్డుపై పడి దెబ్బతిన్నాయి. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడం అంతా ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల: మండలంలోని తూబాడు, గొరిజవోలు గ్రామాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆశాఖ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ చెప్పారు. నాదెండ్ల గ్రామ పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు కూడా విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు.

### కోడిపందెలు స్థావరంపై దాడి

యడ్లపాడు: కోడి పందేల నిర్వహణ స్థావరంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామ శివారులో చట్టవిరుద్ధంగా కోడిపందేలు నిర్వహిస్తున్నారని, బహిరంగంగానే కొనసాగుతున్న ఈపందేల్లో భారీగా డబ్బు పందెంలో కాస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ టి.శివరామ కృష్ణ, సిబ్బందితో కలిసి బుధవారం పందెం నిర్వహించే స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పందేలా నిర్వహించే ఐదుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,150 నగదుతో పాటు, ఒక మృతి చెందిన కోడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కానిస్టేబుళ్లైన హోంగార్డులకు ఎస్పీ అభినందనలు

**నూతన ఉద్యోగాల్లోనూ ఇదే ఒరవడి కొనసాగించాలంటూ సూచన**



హోంగార్డులను అభినందిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన హోంగార్డ్స్‌ను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం అభినందించారు. ఏపీ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించిన కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో జిల్లాకు చెందిన ముగ్గురు హోంగార్డ్స్ సివిల్ విభాగంలో ఉద్యోగాలు సాధించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన పి.నగదర్, ఎస్. వెంకటేశ్వర్లు, బి.నాసరయ్యలను శాలువాలతో జిల్లా ఎస్పీ సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ద్వారా ఈ విజయాన్ని హోంగార్డ్స్ సాధించి తోటి వారికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. హోంగార్డ్స్ విధులు నిర్వహిస్తూ చదువు కొనసాగించడం, పరీక్షల కోసం సన్నద్ధం కావడం సులభమైన విషయం కాదన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగంలో కూడా ఇదే ఆదర్శాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

## సాతులూరులో పర్యటించిన జిల్లావైద్యాధికారి



సాతులూరు బీసీ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి రవి సందర్శించారు. గ్రామానికి చెందిన కూరపాటి మల్లేశ్వరి (36) డెంగ్యూ వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైన నేపథ్యంలో ఆయన గ్రామంలో పర్యటించారు. బీసీ కాలనీలో పారిశుధ్య నిర్వహణపై సిబ్బందితో సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రస్తుతం వైరల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మల్లేశ్వరి మృతి కారణాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సిబ్బంది వైరల్ ఫీవర్ కారణంగానే మల్లేశ్వరి మృతి చెందినట్లు ఆయనకు వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్, సూపర్‌వైజర్ శ్రీను, సిబ్బంది కొండలు, రాజేశ్వరి ఉన్నారు.

## పోయిన సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించిన పోలీసులు



బాధితుడికి మొబైల్ అందజేస్తున్న ఎస్సై బాలకృష్ణ



రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగించిన సీఐ పి.రమేష్

బొల్లాపల్లి: ఇటీవల మొబైల్ మిస్సింగ్ ఫిర్యాదులపై సత్వర స్పందన చూపి రికవరీ చేసి బాధితులకు అందజేయడం జరిగిందని బండ్లమోటు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. స్టేషన్ పరిధిలో బుధవారం రికవరీ అయిన మొబైల్ ను బాధితుడికి అందజేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ బ్లాక్ చేసి ట్రేసింగ్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. స్టేషన్ పరిధిలో అనతి కాలంలోనే 15 మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేశామని చెప్పారు. ప్రతిపౌరుడు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తామని తెలిపారు. ప్రజలు ముందుకు వచ్చి ఎటువంటి ఆందోళన లేకుండా సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

**చిలకలూరిపేటలో...**

చిలకలూరిపేటటౌన్: పౌరులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను రికవరీ చేయడంలో చిలకలూరిపేట అర్బన్ పోలీసులు సత్తా చాటారు. టెక్నాలజీ యుగంలో ఫోన్ కోల్పోతే కలిగే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక లావాదేవీల నుంచి వ్యక్తిగత సమాచారం వరకు అన్నీ అందులోనే ఉంటాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పోలీసులు చూపించిన చొరవ ప్రజలకు ఎంతో ఊరటనిచ్చింది. చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన 8 సెల్ ఫోన్‌లను పోలీసులు రికవరీ చేశారు. బుధవారం అర్బన్ సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో ఫోన్‌లను పోగొట్టుకున్న బాధితులకు వాటిని అప్పగించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ఫోన్‌లను ట్రాక్ చేసి, వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఫోన్‌లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజ్యాంగ వ్యతిరేక జీవో రద్దు చేయాలి


- కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా విద్యాసంస్థల్లో జీవో
- ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల నాయకుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నరసరావుపేట టౌన్: విద్యాసంస్థల్లో ప్రవేశ పెట్టిన రాజ్యాంగ వ్యతిరేక జీవోను వెంటనే ఉపసంహరించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ విద్యాసంస్థలు, హాస్టళ్లలో రాజకీయ పార్టీలు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌లకు ప్రవేశం లేదంటూ జీవో ప్రొసీడింగ్స్ తేవటం రాజ్యాంగ వ్యతిరేకమైందన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ కార్పొరేట్ శక్తులకు మేలు చేయడానికి ఏ రకంగా దిగజారాడో ఈ సంఘటన తేటతెల్లం చేస్తుందన్నారు. ఇలాంటి ఆర్డినెన్స్ రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులకు భిన్నమైనదన్నారు. ఏ పార్టీ అయినా, ఏ సంఘం అయినా విద్యార్థుల మేలుకోరి ఎవరైనా కాలేజీల్లో, హాస్టల్లో జరిగే అక్రమాలను వెలుగులోకి తేవచ్చు. ఆ హక్కు లేదంటే రాజ్యాంగం స్ఫూర్తికి విఘాతం కలిగినట్లే అన్నారు. ఇలాంటి జీవోలు తెచ్చి ప్రజల్లో అప్రతిష్ట పాలు కాకుండా వెంటనే దీన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీయం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, పౌర హక్కుల సంఘం నాయకులు వినుకొండ పేరయ్య, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, రాష్ట్ర ఓబీసీ సంఘం అధ్యక్షులు కటారి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు మెమోరాండం అందించారు.

### విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



చిలకలూరిపేటటౌన్: షాపు సైన్‌బోర్డును తగిలించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతమై యువకుడు మృత్యువాత పడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం... పసు మర్రు గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌కు ఇద్దరు సంతానం. వారిలో పెద్దవాడైన అమీర్ (23) తండ్రితో కలిసి కొన్నేళ్లుగా కేబీరోడ్డులోని ట్రావెలర్ బంగ్లా కాంప్లెక్స్ వద్ద నాగూర్ ఎలక్ట్రానిక్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు సదరు దుకాణం ఆక్రమణలో ఉందంటూ తొలగించాలని ఈనెల 2వ తేదీని జేసీబీని సైతం తెచ్చారు. ఈ క్రమంలో అక్కడి నుంచి తొలగించి ఆదేరోడ్డులోని లాహిరీ హాస్పిటల్ సమీపంలో కొత్తగా మరోషాపును అద్దెకు తీసుకుని షాపును ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి సంబంధించిన సైన్‌బోర్డును గోడకు అమర్చే క్రమంలో సమీపాన ఉన్న విద్యుత్ తీగ అమీర్ తలకు తగలడంతో షాక్‌కు గురై అపస్మారస్థితికి వెళ్లాడు. వెంటనే స్థానికులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో పసుమర్రు గ్రామంలోని వారి వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## న్యాయవాదుల గైర్హాజరుకు తాత్కాలిక విరమణ

నరసరావుపేట టౌన్: న్యాయాధికారులను బదిలీ చేయాలని నరసరావుపేట న్యాయవాదులు చేపట్టిన నిరసన తాత్కాలికంగా వాయిదా వేసినట్లు న్యాయవాద సంఘ అధ్యక్షుడు జి. సుబ్బారావు బుధవారం తెలిపారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జీలు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ న్యాయవాదులు ఆ రెండు కోర్టులకు విధులు బహిష్కరించిన విషయం విదితమే. గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి నుంచి లభించిన హామీ మేరకు సంఘ కార్యాలయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనను తాత్కాలికంగా వాయిదా వేయనున్నట్లు తీర్మానం చేశారు. ఈనెల 22 వరకు విధుల గైర్హాజరు విరమిస్తున్నట్లు అధ్యక్షులు జీవీ సుబ్బారావు తెలిపారు. అప్పట్లోగా తమ సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నామన్నారు. లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ ప్రణాళికను 24తేదీ ప్రత్యేక సమావేశం నిర్వహించి రూపొందిస్తామని ఆయన తెలిపారు.

### నవధాన్య సేద్యం .. భూమాతకు నైవేద్యం

ఈపూరు(శావల్యాపురం): నవధాన్య సేద్యం చేయటం ద్వారా భూమాతకు నైవేద్యం అందించటమేనని ఈపూరు మండల వ్యవసాయ అధికారి రామినేని రామరావు అన్నారు. బుధవారం రెండవరోజు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను సందర్శించారు. ఈసందర్భంగా ఈపూరు గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు కాటం చిన నాగరాజు, మద్దం ఆదిలక్ష్మి సాగు చేసిన వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయ అధికారులు ప్రకృతి వ్యవసాయ టీం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య మాట్లాడుతూ కాటం నాగరాజు సాగు చేసిన పి.ఎం.డి.స్ (30 రకాల విత్తనాలు)లో పంట కోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు మేకల భాస్కరరావు,దారా ప్రకాష్‌రావు, తిరుపతిరావు, శివలక్ష్మి, హనుమంతరావు, లక్ష్మి నాయక్, ఆంజనేయులు, ఏఈవో పురేటి అశోక రైతులు పాల్గొన్నారు.

### ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

చిలకలూరిపేటటౌన్: విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుల్‌కు సహచర సిబ్బంది మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. సుమారు నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం చికిత్స పొందుతున్న చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ హెచ్‌జీ 697 ఎం.శ్రీనివాసరావుకు సీఆర్ క్లబ్ తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. స్థానిక చిలకలూరిపేట పట్టణ పోలీసు స్టేషన్లో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది అందరూ కలిసి ఉపాధ్యాయులు ఎం నరసింహారావు చేతుల మీదుగా శ్రీనివాసరావుకు చెక్కును అందజేశారు.

### గేదేల విషయమై వాగ్వాదం

యడ్లపాడు: గేదెల కారణంగా జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీసి ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలోని ఇస్కాన్ గోశాల పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి బుధవారం కొన్ని గేదెలు వచ్చాయి. మూడేళ్లుగా అక్కడ ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న ఇస్కాన్ భక్తుడు డార్జిలింగ్ దేశస్థుడు పుష్పారాయ్ వాటిని గమనించి బయటకు పంపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో గేదెల యజమానులు నలుగురు రావడంతో వారిమధ్య వాగ్వాదం మొదలైంది. మాటామాటా పెరగడంతో పాటు సదరు స్థలం ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, ఘర్షణ దిగారు. ఈ దాడిలో పుష్పారాయ్‌తో పాటు అడ్డుకోబోయిన మరో భక్తుడు బ్రజిత్‌బర్మన్‌కు గాయాలయ్యాయి. చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.శివరామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



